క్లుప్తంగా

ఈవీఎం వినియోగంపై అవగాహన



పెద్దశంకరంపేటలో ఈవీఎం వినియోగంపై అవగాహన కల్పిస్తున్న తహసీల్దార్ గ్రేస్‌బాయి

పెద్దశంకరంపేట(మెదక్): ఎన్నికల కమిషన్, కలెక్టర్ ఆదేశాల మేరకు గ్రామీణ ఓటర్లకు ఈవీఎంలపై అవగాహన కల్పిస్తున్నట్లు తహసీల్దార్ గ్రేస్‌బాయి గురువారం తెలిపారు. ఈవీఎం ద్వారా ఓటు వేయడం, వీవీ ప్యాట్స్ గురించి వివరిస్తున్నామన్నారు. ప్రజలు ఈవీఎంలపై అవగాహన పెంచుకోవాలన్నారు. సర్పంచ్‌లు అనంతరావు, సుధాకర్, ఆర్‌ఐ శరణప్ప, ఎంపీపీ జంగం శ్రీనివాస్, బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు మురళిపంతులు, సీనియర్ నాయకులు ఆర్‌ఎస్ సంతోష్ పాల్గొన్నారు.

ప్రత్యేక పంచాయతీ ఏర్పాటుపై హర్షం



బాణసంచా కాలుస్తున్న ముత్తాయికోట గ్రామస్తులు

హవేళిఘణాపూర్(మెదక్): మండల పరిధిలోని ముత్తాయికోట గ్రామాన్ని ప్రత్యేక పంచాయతీగా ఏర్పాటు చేయడంపై గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. ప్రత్యేక పంచాయతీ ఏర్పాటుకు కృషి చేసిన మెదక్ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డికి మద్దుల్‌వాయి గ్రామ సర్పంచ్ అనురాధ, మాజీ ఎంపీటీసీ శివ, గ్రామస్తులు తదితరులు గురువారం కృతజ్ఞతలు తెలిపారు. ప్రత్యేక పంచాయతీ ఏర్పాటుతో పాలనా సౌలభ్యం మెరుగుపడుతుందని అన్నారు.

చాకరిమెట్ల హుండీ ఆదాయం రూ.13 లక్షలు



కానుకలను లెక్కిస్తున్న భక్తులు, సిబ్బంది

శివ్వంపేట(నర్సాపూర్): ఉమ్మడి జిల్లాలో ప్రసిద్ధి చెందిన చాకరిమెట్ల శ్రీ సహకార ఆంజనేయస్వామి ఆలయ హుండీ లెక్కింపు గురువారం చేపట్టారు. 11 నెలలకు సంబంధించి రూ.13,58,034 వచ్చినట్లు దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ శివరాజ్ తెలిపారు. కార్యక్రమంలో ఇన్‌స్పెక్టర్ రంగారావు, ఈఓ సారా శ్రీనివాస్, ఆలయ ఫౌండర్, చైర్మన్ ఆంజనేయ శర్మ, ప్రధాన అర్చకుడు దేవదత్తశర్మ, సిబ్బంది శ్రీనివాస్, రామకృష్ణ, రాజరాజేశ్వరిమాత భక్తులు తదితరులు పాల్గొన్నారు.

సర్వీస్‌రోడ్డు పొడిగించాలని వినతి

టేక్మాల్(మెదక్): మండలంలోని బొడ్మట్‌పల్లి చౌరస్తా మీదుగా వెళ్తున్న 161 హైవే సర్వీస్‌రోడ్డును పొడిగిస్తే వ్యవసాయ పనులకు అనుకూలంగా ఉంటుందని గురువారం అందోల్ ఎమ్మెల్యే క్రాంతికిరణ్‌కు రైతులు తెలిపారు. సర్వీస్ రోడ్డు లేకపోవడంతో హైవేదాటి వెళ్లాలంటే చాలా ఇబ్బందిపడుతున్నట్లు చెప్పారు. వెంటనే స్పందించిన ఎమ్మెల్యే హైవే అథారిటీ అధికారులకు ఫోన్‌లో మాట్లాడారు. సర్వీస్‌రోడ్డు పొడగించాలని కోరారు. రోడ్డును పరిశీలించి చర్యలు తీసుకుంటామని హైవే అధికారులు ఎమ్మెల్యేకు చెప్పినట్లు తెలిపారు.

నర్సరీల పరిశీలన

రామాయంపేట(మెదక్): నార్సింగి మండలంలోని నర్సంపల్లి, నర్సంపల్లి పెద్దతండా, వల్లూరు గ్రామాల్లోని వన నర్సరీలను గురువారం నార్సింగి ఎంపీపీ చిందం సబిత, ఎంపీడీఓ ఆనందమేరీ సందర్శించారు. నర్సరీల నిర్వాహకులకు వారు పలు సూచనలు చేశారు.

దాడులు పెరిగాయి

నర్సాపూర్‌రూరల్: నర్సాపూర్ మండలం చిప్పల్ తుర్తి గ్రామపంచాయతీ పరిధిలోని సబ్‌స్టేషన్‌లో పనిచేస్తున్న ఆర్టిజన్‌పై దాడిచేసిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని తెలంగాణ స్టేట్ యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ (సీఐటీయూ) గౌరవ అధ్యక్షుడు మహేందర్ రెడ్డి డిమాండ్ చేశారు. గురువారం ఆయన నర్సాపూర్‌లో మాట్లాడుతూ మెదక్ జిల్లాలో ఆర్టిజన్‌లపై దాడులు పెరుగుతున్నా సంబంధిత అధికారులు స్పందించడంలేదన్నారు. చిప్పల్ తుర్తిలో ఆర్టిజన్ దశరథపై దాడి చేసిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలన్నారు.



మాట్లాడుతున్న టీఎస్ఈఈయూ గౌరవ అధ్యక్షుడు మహేందర్ రెడ్డి

కిషన్ రెడ్డి అరెస్టుపై బీజేపీ భగ్గు



నిజాంపేటలో కేసీఆర్ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బీజేపీ నాయకులు

నిజాంపేట(మెదక్): బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్ రెడ్డి అరెస్టును నిరసిస్తూ మండల కేంద్రంలో గురువారం బీజేపీ మండల అధ్యక్షుడు చంద్రశేఖర్ ఆధ్వర్యంలో కేసీఆర్ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలు అందరికీ చేరాలని శాంతిదీక్ష చేస్తున్న పార్టీ రాష్ట్ర అధ్యక్షుడిని అరెస్ట్ చేయడం దారుణమన్నారు. పోలీసుల అక్రమ అరెస్ట్‌కు నిరసిస్తూ బీజేపీ రాష్ట్ర శాఖ పిలుపు మేరకు నిరసన కార్యక్రమం చేపట్టామన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

హవేళిఘణాపూర్(మెదక్): నిరుద్యోగులు, విద్యార్థుల జీవితాలతో సీఎం కేసీఆర్ చెలగాటమాడుతున్నారని ఆరోపిస్తూ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి చేస్తున్న శాంతిదీక్షను పోలీసులు భగ్నం చేయడం విడ్డూరంగా ఉందని బీజేపీ మండల అధ్యక్షుడు రంజిత్‌రెడ్డి అన్నారు. బుధవారం మండల కేంద్రమైన హవేళిఘణాపూర్‌లో మాట్లాడారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం అన్ని రంగాలను భ్రష్టుపట్టిస్తోందన్నారు. సమస్యలను పరిష్కరించాలని కోరుతున్న వారిని అరెస్ట్ చేయడం సరికాదన్నారు. సమావేశంలో బీజేపీ జిల్లా సీనియర్ నాయకులు ఎక్కలదేవి శ్రీపాల్, ఎంఎల్ఎన్ రెడ్డి, పార్టీ మండల ఉపాధ్యక్షుడు రుపేందర్ తదితరులు పాల్గొన్నారు.

పాపన్నపేట(మెదక్): కేంద్ర మంత్రి, రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు కిషన్‌రెడ్డి అరెస్ట్‌కు నిరసనగా గురువారం మండల కేంద్రమైన పాపన్నపేటలో పార్టీ కార్యకర్తలు రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ మండల అధ్యక్షుడు సంతోష్ మాట్లాడుతూ నిరుద్యోగుల పక్షాన పోరాడుతున్న వారిని అరెస్ట్ చేయడం అప్రజాస్వామ్యమన్నారు.

బీఆర్‌ఎస్ పాలనలో గ్రామాలు అభివృద్ధి

● అందోల్ ఎమ్మెల్యే క్రాంతికిరణ్



సీసీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే క్రాంతికిరణ్

టేక్మాల్(మెదక్): బీఆర్‌ఎస్ పాలనలో గ్రామాలు అభివృద్ధి చెందుతున్నాయని అందోల్ ఎమ్మెల్యే క్రాంతికిరణ్ అన్నారు. గురువారం మండలంలోని బొడ్మట్‌పల్లి భద్రకాళీ సమేత వీరభద్రుడికి పూజలు చేశారు. అనంతరం గ్రామంలో సీసీరోడ్డు, ముదిరాజ్ సంఘం భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రూ.88 లక్షలతో బొడ్మట్‌పల్లిలో అభివృద్ధి పనులు జరిగాయన్నారు. అలాగే ఇతర గ్రామాలకు నిధులు కేటాయిస్తున్నామన్నారు. అనంతరం బొడ్మట్‌పల్లి గ్రామ ఉపసర్పంచ్ కంకర శంకరమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతిచెందింది. ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఎమ్మెల్యే వెంట సర్పంచ్ కలాలి స్వరూప, ఆలయ కమిటీ చైర్మన్ బస్వరాజ్, పీఏసీఎస్ చైర్మన్ యశ్వంత్‌రెడ్డి, బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు వీరప్ప, ప్రధాన కార్యదర్శి అవినాష్, నాయకులు తదితరులు ఉన్నారు.

బస్సు సౌకర్యం కల్పించాలి

నిజాంపేట(మెదక్): బస్సు సౌకర్యం కల్పించాలని ఏబీవీపీ రామాయంపేట శాఖ ఆధ్వర్యంలో గురువారం విద్యార్థులు ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఏబీవీపీ రామాయంపేట నగర కార్యదర్శి ప్రశాంత్ మాట్లాడుతూ చల్మెడ, నందగోకుల్ గ్రామాలకు బస్సు సౌకర్యంలేకపోవడంతో విద్యార్థులు ఇబ్బందిపడుతున్నారన్నారు. 150 మంది విద్యార్థులు సకాలంలో కాలేజీలకు వెళ్లలేకపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంపై డీఎం వెంటనే స్పందించి బస్సు సౌకర్యం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఏబీవీపీ నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు సన్మానం

చేగుంట(తూప్రాన్): చేగుంట మండల పరిషత్ కార్యాలయంలో గురువారం మండలస్థాయి ఉత్తమ ఉపాధ్యాయుల సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాసుల శ్రీనివాస్ మాట్లాడుతూ దేశాభివృద్ధికి దోహదం చేసే వ్యక్తులను తయారు చేసేది ఉపాధ్యాయులే అని అన్నారు. అనంతరం ఉపాధ్యాయులను సన్మానించారు. కార్యక్రమంలో సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు మంచికట్ల శ్రీనివాస్, ఉపాధ్యాయ సంఘాల నాయకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి అవార్డు

కౌల్దారం(నర్సాపూర్): మండలంలోని కొంగోడు పంచాయతీకి 2023 గాను స్వచ్ఛ సర్వేక్షన్ గ్రామీణ అవార్డు వచ్చినట్లు ఎంపీడీఓ గణేష్ రెడ్డి గురువారం తెలిపారు. హైదరాబాదులో జరిగిన అవార్డుల ప్రదాన కార్యక్రమంలో పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రెడ్డి చేతుల మీదుగా సర్పంచ్ మంజుల అవార్డు అందుకున్నట్లు పేర్కొన్నారు.

బంద్ ప్రశాంతం

చిన్నశంకరంపేట(మెదక్): సర్పంచ్ రాజిరెడ్డిపై పోలీసులు కేసునమోదు చేసినందుకు నిరసనగా గురువారం నిర్వహించిన చిన్నశంకరంపేట బంద్ ప్రశాంతంగా జరిగింది. మండలంలోని అంబాజీపేట గ్రామానికి చెందిన డోకు లక్ష్మి హఠాన్మరణంతో కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు సర్పంచ్ రాజిరెడ్డిపై కేసు నమోదైన విషయం తెలిసిందే. దీంతో బంద్‌కు పిలుపు ఇచ్చిన రాజిరెడ్డి వర్గీయులు మాజీ సర్పంచ్ శ్రీమన్‌రెడ్డి, ఉపసర్పంచ్ జీవన్ మాట్లాడుతూ డోకు లక్ష్మిని సర్పంచ్ బెదిరించడం నిజంకాదన్నారు. గతంలో మార్వాడికి భూమి అమ్ముకోగా ధరణిలో పొరపాటున ఆమె పేరున వచ్చిందని, దీనిని అధికారులు సవరణ చేశారని వివరించారు. రాజకీయ కక్షలతోనే సర్పంచ్‌పై బీఆర్‌ఎస్ నాయకులు కేసునమోదుకు ప్రోత్సహించారన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ఎడ్ల కిష్టయ్య, రమేష్‌గౌడ్ పాల్గొన్నారు.

సర్పంచ్‌పై మరో వివాదం

చిన్నశంకరంపేట(మెదక్): మండలంలోని మడూర్ గ్రామ భూముల విషయంలో సర్పంచ్ రాజిరెడ్డి అరాచకంగా వ్యవహరిస్తున్నాడని మడూర్ గ్రామానికి చెందిన లింగంగౌడ్ ఆరోపించారు. గురువారం ఆయన మాట్లాడుతూ మడూర్ గ్రామంలో పవన్‌కుమార్‌గుప్తా భూములు కొనుగోలు చేశాడని, అయితే ఆ భూములు ఇతర చోట్ల ఉండగా సర్పంచ్ రాజిరెడ్డి ఒకే చోట భూములకు ప్రహరీనిర్మిస్తున్నాడన్నారు. ఈ విషయంపై చిన్నశంకరంపేట పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. కాగా ఈ విషయంపై తనకెలాంటి సంబంధంలేదని సర్పంచ్ రాజిరెడ్డి వివరణ ఇచ్చారు.

ఘనంగా హిందీ దివస్



చెట్లతిమ్మాయిపల్లిలో హిందీ దివస్ గురించి వివరిస్తున్న ఉపాధ్యాయుడు సుధాకర్

హవేళిఘనపూర్(మెదక్): మండల కేంద్రమైన హవేళిఘనపూర్‌తోపాటు మండల పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల్లో బుధవారం హిందీ దివస్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఉపాధ్యాయులు హిందీ ప్రాముఖ్యతను వివరించారు. హిందీ భాషను అధికారిక భాషగా గుర్తించడంతో ఎందరో కవులు, రచయిత భాష అభివృద్ధికి కృషి చేశారని కొనియాడారు. హవేళిఘనపూర్ జ్యోతిరావుపూలే బాలికల గురుకుల పాఠశాలలో ప్రిన్సిపాల్ రజిని ఆధ్వర్యంలో హిందీ దివస్ నిర్వహించారు. కార్యక్రమంలో హిందీ ఉపాధ్యాయులు జయలక్ష్మి, చంద్రకాంత్, మల్లారెడ్డి, లక్ష్మీకాంతం, జాకిర్ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

చేగుంట(తూప్రాన్): మండలంలోని పలు ప్రభుత్వ పాఠశాలల్లో గురువారం హిందీ దివస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. మక్కరాజిపేట ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు హిందీ దివస్‌పై పోటీలను నిర్వహించారు. చెట్లతిమ్మాయిపల్లి ప్రాథమికోన్నత పాఠశాలలో హిందీ భాష ప్రాముఖ్యతను ఉపాధ్యాయుడు సుధాకర్ వివరించారు. ఆయా కార్యక్రమాల్లో ప్రధానోపాధ్యాయులు అమర్‌శేఖర్ రెడ్డి, బాలరాజయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మెదక్ మున్సిపాలిటీ: పట్టణంలోగల సిద్ధార్థ్ విద్యా సంస్థల్లో గురువారం జాతీయ హిందీ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. భారతీయులు ఓకేతాటిపై నిలబడాలని, భారత దేశానికి రాజ్యభాషగా హిందీని గుర్తించిన రోజుగా జరుపుకుంటామని ఉపాధ్యాయులు తెలిపారు. విద్యార్థులు హిందీ దివస్ ఆకృతిలో కూర్చొని హిందీ గొప్పతనాన్ని చాటారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శ్రీమతి కె.సంధ్యారాణి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

శివ్వంపేట(నర్సాపూర్): మండల పరిధి పెద్దగొట్టిముక్కల ఉన్నత పాఠశాలలో గురువారం హిందీ దివస్ నిర్వహించారు. హెచ్ఎం రాజు ఆధ్వర్యంలో విద్యార్థులకు వ్యాసరచన, ఉపన్యాస పోటీలను నిర్వహించారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో హిందీ ఉపాధ్యాయుడు మోహసీన, పాల్గొన్నారు.

భూ నిర్వాసితులకు పూర్తి సహకారం



భూ నిర్వాసితులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మదన్ రెడ్డి

కౌల్దారం(నర్సాపూర్): నర్సాపూర్–మెదక్ జాతీయ రహదారి విస్తరణలో భాగంగా మండలంలోని అప్పాజిపల్లికి చెందిన భూ నిర్వాసితులకు సహకారం అందిస్తామని నర్సాపూర్ ఎమ్మెల్యే మదన్ రెడ్డి అన్నారు. గురువారం వారితో సమావేశమయ్యారు. నష్టపరిహారం కింద ప్రభుత్వం చెక్కులు విడుదల చేసింది. అయితే భూమికి భూమి ఇవ్వాలంటూ చెక్కులను తిరస్కరించారు. దీంతో వారికి నచ్చజెప్పడానికి ఎమ్మెల్యే ప్రయత్నించారు.వారు అంగీకరించకపోవడంతో భూమికి బదులు భూమి, డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల నిర్మాణానికి సహాయం అందిస్తామని హామీ ఇచ్చారు.

ఆయుష్మాన్‌భవఃపై శిక్షణ

తూప్రాన్: కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన ఆయుష్మాన్ భారత్ కార్యక్రమంలో భాగంగా ఆయుష్మాన్ భవఃపై ఆశా కార్యకర్తలకు పట్టణంలోని సామాజిక ఆరోగ్య కేంద్రంలో గురువారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. శిక్షణ కార్యక్రమానికి తూప్రాన్, నార్సింగి, చేగుంట, వెల్దుర్తి, చిన్నశంకరంపేట మండలాలకు చెందిన ఆశా కార్యకర్తలు హాజరయ్యారు. గ్రామాలవారీగా ఇంటింటి సర్వేచేసి దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడేవారు, గ్రామస్తుల ఆరోగ్య వివరాలు సేకరించాలని అధికారులు సూచించారు. దారిద్య్రరేఖకు దిగువకు ఉన్న పేదలకు రూ.5లక్షల వరకు ప్రభుత్వ, కార్పొరేట్ ఆసుపత్రుల్లో వైద్యం అందించడమే ముఖ్య ఉద్దేశమన్నారు.

సీడీపీఓ ఆఫీసు ముట్టడి

నర్సాపూర్: అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు తమ నిరవధిక సమ్మెలో భాగంగా గురువారం సీడీపీఓ ఆఫీసును ముట్టడించి ఆఫీసు ఎదుట ధర్నా చేశారు. సమ్మె గురువారం నాటికి నాలుగో రోజుకు చేరింది. ముట్టడి కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు మహేందర్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు నాగరాజు, జిల్లా అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ అధ్యక్షురాలు అన్నపూర్ణ పాల్గొన్నారు.

ఘనంగా పోలాల అమావాస్య పూజలు



తూప్రాన్‌లో పోలాల అమావాస్య పూజల్లో మహిళలు

తూప్రాన్: పట్టణ కేంద్రంలో గురువారం పోలాల అమావాస్యను మహిళలు ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా పట్టణంలోని మహంకాళి దేవాలయం ప్రాంగణంలోని నల్ల పోచమ్మ దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. సంతానం సంరక్షణకు నిర్వహించే పోలాల అమావాస్యను మహిళలు భక్తి శ్రద్ధలతో నిర్వహించడం ఆనవాయితీ. అమ్మవారికి వివిధ రకాల వంటకాలతో చేసిన నైవేద్యం సమర్పించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య, విశ్వకర్మ మహిళలు పాల్గొన్నారు.

బగలాముఖీ ఆలయంలో అమావాస్య పూజలు



హోమం నిర్వహిస్తున్న దృశ్యం

శివ్వంపేట(నర్సాపూర్): మండల కేంద్రమైన శివ్వంపేటలోని బగలాముఖీ శక్తిపీఠంలో గురువారం శ్రావణమాసం చివరిరోజు, అమావాస్య సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేద పండితుడు శాస్త్రుల వెంకటేశ్వరశర్మ అమ్మవారికి అభిషేకం, విశేష పూజలు, హోమం చేశారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ భూదాత పబ్బ రమేష్‌గుప్తా అన్నప్రసాద వితరణ చేశారు. కాగా, బగలాముఖీ అమ్మవారిని గురువారం రాష్ట్ర మహిళా కమిషన్ చైర్ పర్సన్ సునీతాలక్ష్మారెడ్డి, మాజీ మంత్రి, ఎమ్మెల్యే శ్రీధర్‌బాబు దర్శించుకొని పూజలు చేశారు. వారిని జెడ్పీటీసీ పబ్బ మహేష్‌గుప్తా, సర్పంచ్ శ్రీనివాస్‌గౌడ్ సన్మానించారు.

ఆర్డీఓ కార్యాలయ ఏర్పాటుకు భవనం పరిశీలన



భవనాన్ని పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు

రామాయంపేట(మెదక్): రామాయంపేటలో ఆర్డీఓ కార్యాలయం ఏర్పాటుకు ఎంపిక చేసిన భవనాన్ని గురువారం అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు పరిశీలించారు. గతంలో హాస్టల్‌గా కొనసాగిన ఈభవనంలో మార్పులు, చేర్పులు చేయాలని సూచించారు. ఆయన వెంట తహసీల్దార్ రజనీకుమారి, పంచాయత్‌రాజ్ ఏఈ విజయకుమార్, ఆర్‌ఐ రాజు, హాస్టళ్ల సంక్షేమ అధికారులు ఉన్నారు.

ఫుట్‌బాల్ పోటీలు ప్రారంభం

రామాయంపేట(మెదక్): రామాయంపేటలో యువజ్యోతి స్పోర్ట్స్ క్లబ్ ఆధ్వర్యంలో గురువారం ఫుట్‌బాల్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీలను అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు ప్రారంభించారు. క్రీడాకారులను పరిచయం చేసుకొన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ రజనీకుమారి, యువజ్యోతి స్పోర్ట్స్‌క్లబ్ కోఆర్డినేటర్ సత్యనారాయణ, పీఈటీలు శంకర్, భూదయ్య, యాదగిరి, పాల్గొన్నారు.

సంపద వనాల పనులు పూర్తిచేయాలి

● పీఆర్ ఈఈ సత్యనారాయణరెడ్డి



పనులను పరిశీలిస్తున్న పీఆర్ ఈఈ సత్యనారాయణరెడ్డి

కౌడిపల్లి(నర్సాపూర్): సంపద వనాల పనులను త్వరగా పూర్తిచేసి లక్ష్యం మేరకు మొక్కలు నాటాలని పీఆర్ ఈఈ సత్యనారాయణరెడ్డి అన్నారు. గురువారం మండలంలోని కొట్టాల పంచాయతీ లింగంపల్లిలో చేపట్టిన సంపద వనాల పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంపిక చేసిన సంపద వనాలలో త్వరగా మొక్కలు నాటాలన్నారు. ఈ వనాలతో సంపదను సృష్టించి గ్రామాలకు ఆదాయం సమకూర్చుకోవాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ నరహరి, పీఆర్ డిప్యూటీఈఈ అమరేశ్వర్, ఏఈ ప్రభాకర్, పంచాయతీ కార్యదర్శులు ప్రవీణ్‌రెడ్డి, మల్లేశం, గ్రామస్తులు పాల్గొన్నారు.

సర్వసభ్య సమావేశంలో సమస్యలపై చర్చ

మనోహరాబాద్(తూప్రాన్): మండల కేంద్రమైన మనోహరాబాద్ గ్రామ పంచాయతీ సర్వసభ్య సమావేశం సర్పంచ్ చిట్కుల మహిపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. గ్రామ సమస్యల పరిష్కారం కోసం చర్చించారు. సమావేశంలో ఎంపీటీసీ లతవెంకటేశ్‌గౌడ్, ఆత్మకమిటీ డైరెక్టర్ రేణుమహేందర్, ప్రధానోపాధ్యాయుడు వెంకటస్వామిగౌడ్, ప్యాక్స్ డైరెక్టర్ జావెద్‌పాషా, ఐకేపీ మహిళా సంఘం సభ్యులు, ఆశావర్కర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు, పంచాయతీ కార్యదర్శి రూపగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

చెక్కుల పంపిణీ

పెద్దశంకరంపేట(మెదక్): రైతులకు బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఎప్పుడూ అండగా ఉంటుందని నారాయణఖేడ్ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి అన్నారు. గురువారం నారాయణఖేడ్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో చెక్కుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. మండలంలోని బద్దారం గ్రామానికి చెందిన రైతు మచ్కూరి రమేష్ మృతి చెందడంతో అతడి భార్య సాయవ్వకు మంజూరైన రూ.5 లక్షల బీమా చెక్కు, సీఎంఆర్ఎఫ్ కింద మాడ్చెట్‌పల్లికి చెందిన రుక్కమ్మకు రూ.లక్ష, టెంకటికి చెందిన సంగయ్యకు రూ.60 వేలు, గోపని వెంకటాపూర్‌కు చెందిన భూమాగౌడ్‌కు రూ.45 వేల చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ జంగం శ్రీనివాస్, జెడ్పీటీసీ విజయరామరాజు పాల్గొన్నారు.

పండుగలను శాంతియుతంగా జరుపుకోవాలి



మాట్లాడుతున్న తూప్రాన్ డీఎస్పీ మోహన్‌రెడ్డి

రామాయంపేట(మెదక్): వినాయక చవితి, మిలాద్–ఉన్–నబీ పండుగలను శాంతియుతంగా జరుపుకోవాలని తూప్రాన్ డీఎస్పీ యాదగిరిరెడ్డి అన్నారు. గురువారం రామాయంపేటలో నిర్వహించిన పీస్ కమిటీ సమావేశంలోమాట్లాడుతూ పండుగలను ప్రజలు కలిసిమెలిసి చేసుకోవాలన్నారు. వినాయక విగ్రహాల ఏర్పాటుకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సీఐ లక్ష్మీబాబు, తహసీల్దార్ రజనీకుమారి, మున్సిపల్ కమిషనర్ ఉమాదేవి, ఎంపీపీ భిక్షపతి, తదితరులు పాల్గొన్నారు.

నిజాంపేట(మెదక్): పండుగలను ప్రజలు శాంతియుతంగా జరుపుకోవాలని ఎస్ఐ శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. గురువారం నిజాంపేట పోలీస్ స్టేషన్ ఆవరణలో పీస్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వినాయక చవితి, మిలాద్–ఉన్–నబీ పండుగలను శాంతియుత వాతావరణంలో జరుపుకోవాలన్నారు. కార్యక్రమంలో మండల ఎంపీపీ దేశెట్టి సిద్ధరాములు, చల్మెడ సర్పంచ్ నరసింహారెడ్డి, ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ **పోషకాహారం తీసుకోవాలి**

వెల్దుర్తి(తూప్రాన్): వెల్దుర్తి పంచాయతీ పరిధి శేరీల అంగన్‌వాడీ కేంద్రంలో గురువారం పోషణ మాసోత్సవాల కార్యక్రమం నిర్వహించారు. ఆకుకూరలు, చిరుధాన్యాల ప్రయోజనాలను గర్భిణులు, బాలింతలు, తల్లులకు అంగన్‌వాడీ టీచర్ దేవలత వివరించారు. వీటిని తీసుకోవడం వలన సంపూర్ణ ఆరోగ్య కలుగుతుందన్నారు. కార్యక్రమంలో ఏఎన్ఎం స్రవంతి పాల్గొన్నారు.

◆ **అర్హులకు దళితబంధు ఇవ్వండి**

శివ్వంపేట(నర్సాపూర్): అర్హులకు దళితబంధు ఇవ్వాలని మండల పరిధి అల్లీపూర్ గ్రామ దళితులు డిమాండ్ చేశారు. అర్హులైన దళిత కుటుంబాలకు దళితబంధు ఇస్తామని చెప్పి కాలయాపన చేస్తున్నారంటూ గ్రాంచాయతీ కార్యాలయం ఎదుట గురువారం ధర్నా చేశారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

◆ **బీజేపీ పట్టణ ప్రధాన కార్యదర్శిగా శరత్**

తూప్రాన్: బీజేపీ పట్టణ ప్రధాన కార్యదర్శిగా పోతురాజు శరత్, బీజేవైఎం అధ్యక్షుడిగా మనిసాయిని నియమిస్తూ ఆ పార్టీ పట్టణ అధ్యక్షుడు రామునిగారి మహేశ్‌గౌడ్ గురువారం నియామక పత్రం అందజేశారు. కార్యక్రమంలో అసెంబ్లీ విస్తరక్ అనూష్ యాదవ్, అసెంబ్లీ కన్వీనర్ సాయిబాబా, నాయకులు నర్సోజి నరసింహారెడ్డి, పోచందర్, సంపత్ గౌడ్, సాయి తదితరులు పాల్గొన్నారు.

◆ **పటాన్ చెరు బస్సురూట్ మార్పు**

నర్సాపూర్ రూరల్: పటాన్ చెరు బస్సురూట్ మార్చినట్లు నర్సాపూర్ డిపో మేనేజర్ సుధా గురువారం తెలిపారు. నర్సాపూర్ నుంచి కొండాపూర్ వయా కాగజ్ మద్దూర్, నత్నయపల్లి, షేర్‌ఖాన్‌పల్లి మీదుగా వెళ్లే పటాన్‌చెరు బస్సులు బీవీఆర్ ఐటీ వయా అవంచ, ఎల్లాపూర్, ఎల్లమ్మగూడ, వడ్డేపల్లి చౌరస్తా, నాగారం, సోలక్‌పల్లి మీదుగా వెళ్తున్నాయన్నారు. కొండాపూర్, కాగజ్ మద్దూర్, నత్నయ్యపల్లి, షేర్‌ఖాన్‌పల్లి వరకు రోడ్డు దెబ్బతిందని, దీంతో తరచూ బస్సులు పాడై నష్టం వాటిల్లుతోందన్నారు. ఆర్‌అండ్‌బీ అధికారులు స్పందించి రోడ్డు మరమతులు చేపట్టాలన్నారు.

◆ **కళాశాలలో మాక్ పోలింగ్**

శివ్వంపేట(నర్సాపూర్): మండల కేంద్రమైన శివ్వంపేటలో ప్రభుత్వ జూనియర్ కాలేజీలో గురువారం విద్యార్థులకు మాక్ పోలింగ్ నిర్వహించారు. ప్రిన్సిపాల్ వెంకటసుబ్బయ్య ఆధ్వర్యంలో ఎన్నికలపై అవగాహన కల్పించారు. 18 సంవత్సరాలు నిండిన వారు విధిగా ఓటుహక్కు పొందాలన్నారు. విద్యార్థులు ఎన్నికల అధికారులుగా వ్యవహరించి ఓటింగ్ ప్రక్రియ నిర్వహించారు.

◆ **సీసీ రోడ్లు, భూగర్భ డ్రైనేజీ పనులకు ప్రారంభం**

మనోహరాబాద్(తూప్రాన్): మండలంలోని కాళ్లకల్ గ్రామంలో సీసీ రోడ్లు, భూగర్భ డ్రైనేజీ పనులను సర్పంచ్ నత్తిమల్లేశ్ ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ 7, 12 వ వార్డుల్లో రూ.5 లక్షల గ్రామ పంచాయతీ నిధులతో సీసీ రోడ్డు, భూగర్భ డ్రైనేజీ పనులు ప్రారంభించామన్నారు. కార్యక్రమంలో వార్డు సభ్యులు నరేష్, ముదిరాజ్ సంఘం అధ్యక్షులు కరాటే మల్లేశ్, శ్రీశైలం, మల్లేశ్ తదితరులు పాల్గొన్నారు.

◆ **రేణుకమాత ఆలయంలో చోరీ**

చిన్నశంకరంపేట(మెదక్): మండలంలోని సూరారం రేణుకమాత ఆలయంలో గుర్తుతెలియని దుండగులు చోరీకి పాల్పడ్డారు. బుధవారం రాత్రి ఆలయంలోని ప్రధాన ద్వారం తాళం పగులకొట్టిన హుండీని ఎత్తుకెళ్లారు. ఈ వేసవిలో నిర్వహించిన రేణుకమాత ఆలయ ఉత్సవాల నుంచి హుండీ లెక్కించలేదని గౌడ సంఘం నాయకులు తెలిపారు. చోరీపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు చెప్పారు.

◆ **రేషన్ షాపు ఏర్పాటుకు వినతి**

రామాయంపేట(మెదక్): రామాయంపేటలోని కేసీఆర్ కాలనీ (డబుల్ బెడ్‌రూం కాలనీ)లో రేషన్ షాపు ఏర్పాటు చేయాలని కాలనీవాసులు విజ్ఞప్తి చేశారు. గురువారం విలేకరులతో మాట్లాడుతూ రేషన్ బియ్యంకోసం ఐదు కిలోమీటర్లు వెళ్లాల్సి వస్తుందని వాపోయారు. రేషన్ దుకాణంతోపాటు కాలనీవద్ద ఆర్టీసీ బస్‌స్టాప్ ఏర్పాటు చేయించాలని విజ్ఞప్తిచేశారు. ఈమేరకు తహసీల్దార్ రజనీకుమారికి వినతిపత్రం అందజేశారు.

◆ **పాడిగేదెల మృతి**

కౌల్దారం(నర్సాపూర్): పాడుబడ్డ బావిలో ప్రమాదవశాత్తు పడి రెండు పాడి గేదెలు మత్యువాత పడ్డాయి. ఈ సంఘటన మండలంలోని ఎనగండ్ల గ్రామంలో గురువారం వెలుగులోకి వచ్చింది. వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన మన్నె శంకరయ్య మేత కోసం తన రెండు పాడిగేదెలు, దూడలను ఎల్లమ్మ దేవాలయ సమీపంలోకి తీసుకెళ్లాడు. మేత మేసుకుంటూ వెళ్లి పాడుబడ్డలో దూడలు, గేదెలు పడిపోయాయి.